క్లుప్తంగా

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రస్తుత వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ వైద్యులు ప్రశాంత్ వర్ధన్ తెలిపారు. బుధవారం నగరంలోని రాజీవ్‌నగర్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ సికిల్‌సెల్ డే సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించి హెచ్‌బీ పరీక్షలు నిర్వహించారు. సికిల్‌సెల్ వ్యాధి అంటే వారసత్వంగా వచ్చే రక్తంలో ఎర్ర రక్తకణాల రుగ్మత అన్నారు. ఇది తల్లిదండ్రుల నుంచి అనువంశికంగా సంక్రమిస్తుందన్నారు. ఇది అంటువ్యాధి మాత్రం కాదని, సాధారణంగా రక్తంలో ఎర్ర రక్తకణాలు గుండ్రంగా ఉంటాయని, సికిల్‌సెల్ వ్యాధి గ్రస్తుల్లో ఎర్ర రక్తకణాలు కొంకి ఆకారంలో ఉంటాయన్నారు. అనంతరం వ్యాధికి సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంధ్యారాణి, సుబ్బరాయుడు, సూపర్‌వైజర్లు, ట్రైనీ డాక్టర్లు శివ, శశి, కౌశిక్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

పొద్దుటూరు ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి



డీఈఓ కార్యాలయ ఏడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్: పొద్దుటూరు పట్టణంలో 13 ఏళ్లుగా పనిచేస్తూ కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలకు వత్తాసు పలుకుతున్న ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఓ, పీఎస్‌వైఎఫ్, ఏఐఎస్‌యూ విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొద్దుటూరు ఎంఈఓ ప్రభుత్వ ఉపాధ్యాయులకు సంబంధించిన జీతాలను చేయడంలో పూర్తి నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలను విక్రయిస్తున్నా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. అనంతరం డీఈఓ కార్యాలయ ఏడీ మునీర్‌ఖాన్‌ను వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్,నాగరాజు, పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసులు పాల్గొన్నారు.

22న పుస్తకావిష్కరణ

కడప కల్చరల్ : కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈ నెల 22న విద్వాన్ కేవీ రమణారెడ్డి రచించిన 'ప్రజ్ఞాన ప్రకాశిక' పుస్తకం ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు తెలిపారు. ఈ సందర్భంగా అదే రచయిత రాసిన 'గీర్వాణి తిలకం గీతాంజలి' పుస్తకం పరిచయం ఉంటుందన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి వైవీయూ పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అధ్యక్షత వహించనున్నారు. వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. ఆచార్య మేడిపల్లి రవికుమార్ పుస్తక సమీక్ష చేస్తారని, గజ్జెల అశోక్ రెడ్డి పుస్తక పరిచయం నిర్వహిస్తారని తెలిపారు.

సీనియర్ సిటిజన్‌లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



వృద్ధాశ్రమంలో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప అర్బన్: సీనియర్ సిటిజన్‌లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కడప నగర శివార్లలోని రామాంజనేయపురంలో వున్న చౌడమ్మ వృద్ధాశ్రమంలో జడ్జి పర్యటించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం 2007, ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల వయో వృద్ధుల పోషణ సంక్షేమ నియమావళి 2011ను వివరించారు. సీనియర్ సిటిజన్ టోల్ ఫ్రీ నెంబర్: 14567, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 15100పై అవగాహన కలిగించారు. వృద్ధ తల్లిదండ్రులను, వృద్ధులను ఆదరించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరిస్తామని హామీ ఆయన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చౌడమ్మ వృద్ధాశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

వానొస్తే ఇంతే..





వర్షపు నీటితో నిండి ఉన్న డ్రైవింగ్ ట్రాక్ (ఇన్‌సెట్) పాత రిమ్స్‌కు వెళ్లే రహదారిలో నిలిచిన వాన నీరు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగర శివార్లలోని ఊటుకూరులోని జిల్లా ఉప రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించే డ్రైవింగ్ టెస్టుకు వాహనదారులకు అగచాట్లు తప్పడం లేదు. డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించే ట్రాక్‌లో మంగళవారం అర్ధరాత్రి కురిసిన వానకు డ్రైవింగ్ ట్రాక్ మొత్తం నీటితో మునిగిపోయింది. సొంత డ్రైవింగ్ ట్రాక్ జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి లేకపోవడంతో వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని స్థలంలో నిర్వహిస్తున్నారు.

పాతరిమ్స్ వద్ద కష్టమే..

కడప రూరల్: కడప నగరంలోని పాత రిమ్స్ ప్రాంగణంలోకి వెళ్లే దారి వానొస్తే పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. ఈ దారి కొంత భాగం గుంతలమయంగా మారింది. ఫలితంగా ఇటీవల కురుస్తున్న వానలకు ఇక్కడ వర్షపు నీరు నిలిచి తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తోంది. పాత రిమ్స్ సముదాయంలో ప్రభుత్వ హోమియోపతి వైద్య శాల, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం, 108 అంబులెన్స్ వాహనాల సంస్థ, అనాథశరణాలయాలు ఇలా పలు సంస్థలు పని చేస్తున్నాయి. దారి సరిగా లేనందున వానా కాలంలో ఈ దారిలో రావాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ అంధకారం

ప్రొద్దుటూరు క్రైం : మత్తు పదార్థాలు వినియోగిస్తే భవిష్యత్ అంధకారం అవుతుందని సెబ్ సీఐ మహేష్‌కుమార్ అన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో నారాయణ జూనియర్ కాలేజీలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని తల్లిదండ్రులు, అధ్యాపకులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. మత్తు పదార్థాల జోలికి ఎవ్వరూ వెళ్లరాదని చెప్పారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ కిశోర్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరుతూ బుధవారం గో సంరక్షణ సమితి, శివశక్తి, భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సాయినాథరెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో యథేచ్ఛగా గోవధ జరుగుతోందని, దానిని ఆపాలన్నారు. బొల్లవరం, పెద్దగుంత, ఎల్ఐసీ ఆఫీసువద్ద, మదర్‌థెరిసా ఆశ్రమం సమీపంలో బహిరంగంగానే గోవధ జరుగుతోందన్నారు. పలుసార్లు గో సంరక్షణా సమితి వారు దానిని అరికట్టేందుకు ప్రయత్నించినా గోవధ ఆగడం లేదన్నారు. గోవధ నిషేధాన్ని కఠినంగా అమలు చేసి గోవులను కాపాడాలని కోరారు. అలాగే మాంసం దుకాణాలు ఇష్టానుసారంగా శుభ్రతను పాటించకుండా ఎక్కడ పడితే అక్కడ మేకలు, పొట్టేళ్లను కోసి విక్రయిస్తున్నారని, దీనివల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గో సంరక్షణా సమితి అధ్యక్షుడు శివనాగిరెడ్డి, బీజేపీ పట్టణాధ్యక్షుడు నారేంద్రరావు, శివశక్తి రాయలసీమ కన్వీనర్ పుల్లారెడ్డి, రాఘవేంద్రారెడ్డి, దశమందం బాబు, శేషన్న, అనిల్‌కుమార్, రవితేజ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత మార్గం వైపు పయనించాలి

– వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ/ కడప కల్చరల్: సమాజంలో జరుగుతున్న సంఘటనలను అర్థం చేసుకొని ఉన్నతమైన మార్గం వైపు పయనించే యువత ఎప్పుడూ విజయ పథంలో పయనిస్తారని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. కథా రచయిత జ్యోతి జార్జి రచించిన 'అనుకోని అతిథి' పుస్తకాన్ని యోగివేమన విశ్వవిద్యాలయంలో వీసీ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిదశలో విద్యార్థి లక్ష్యసాధనకు ప్రేమ వ్యవహారాలు అవరోధంగా నిలుస్తాయన్నారు. ఇందుకు ఎన్నో ఉదాహరణలు రచయిత తన కథల్లో అక్షర రూపం ఇచ్చారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా యువత అడుగులు వేస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి , పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సమాజాన్ని దృష్టిలో ఉంచుకొని, సమకాలీన పరిస్థితులకు దర్పణంగా నిలిచేలా జార్జి కథలు కనిపిస్తాయన్నారు. రచయితను కవి, విశ్రాంత తెలుగు భాషోపాధ్యాయులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వర చారి, జర్నలిజం శాఖ అధ్యాపకులు డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు అభినందించారు.

వినతులు స్వీకరించిన ఎంపీ



ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. పులివెందుల పట్టణం బాకరాపురంలోని ఆయన నివాసంలో బుధవారం ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలనుంచి వచ్చిన ప్రతిసమస్యను తప్పకుండా పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనీమియా వ్యాధి నివారణ మన లక్ష్యం



మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి



జమ్మలమడుగు : ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

చింతకొమ్మదిన్నె : అనీమియా వ్యాధి నిర్మూలన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని చింతకొమ్మదిని వైద్యాధికారి రాఘవేంద్ర, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి తెలిపారు. మండలంలోని సుగాలిబిడికి గ్రామంలో అనీమియ వ్యాధిపై బుధవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన ఉప కేంద్రాలలో జన్యుపరమైన కారణాల వల్ల మనుషుల్లో వచ్చే ఈ వ్యాధిపై పలు సూచనలు చేయడంతో పాటు, ఈ వ్యాధి వల్ల మనుషుల్లో రక్త కణాలు కొడవలి ఆకారంలో ఉండి శరీరానికి కావాల్సిన ఆక్సిజన్ అందించలేని స్థితిలో ఉంటాయన్నారు. ఫలితంగా రక్తహీనత ఏర్పడి అలసటగా ఉండటం, శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండటం, అంటువ్యాధుల బారిన పడటం ఈ వ్యాధి లక్షణాలు అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్ఓ సుకుమారన్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనిమియా వంశపారంపర్యంగా వస్తుంది

జమ్మలమడుగు : అనిమియా వ్యాధి వంశపారంపర్యంగా వస్తుందని డాక్టర్ దీపిక తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సికిల్ సెల్ అనిమియా వ్యాధిపై ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనిమియా వ్యాధి సోకిన వారికి రక్త కణాల సంఖ్య తగ్గడం, కళ్లు పసుప రంగులోనికి మారడం, తీవ్రమైన శరీర నొప్పులు, కీళ్లనొప్పులు, శ్వాస తీర్చుకోవడంలో ఇబదులు, అలసట, గర్భధారణ సమయంలో సమస్యలు రావడం తోపాటు శరీర అవయవాలకు నష్టం కలిగే ప్రమాదం ఉందన్నారు. ఈ వ్యాధి సోకిన వారు సరైన సమయంలో వ్యాధికి చికిత్స తీసుకోవడం ద్వారా నయం చేసుకోవచ్చు అని సూచించారు. వ్యాధి సోకిన వారు సమతుల పౌష్టికాహారం, ప్రత్యేక టీకాలతోపాటు ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవాలని సూచించారు. ఏపీఎం గురుకుమార్, నారారయణరెడ్డి, సూపర్‌వైజర్ ఓబులేసు, రేణుకా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదినం



ఆదరణ నిరాశ్రయుల గృహంలో అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగపు నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: దేశ ప్రజల ఆశా కిరణం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అని కాంగ్రెస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య పేర్కొన్నారు. బుధవారం రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా నగరంలోని ఆదరణ నిరాశ్రయుల గృహంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టాక్సీ యూనియన్ రాష్ట్ర కోఆర్డినేటర్ హబీబుల్లా, జిల్లా అధ్యక్షుడు శివ, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు, యువజన కాంగ్రెస్ అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, మహిళా నాయకురాలు లావణ్య, విద్యార్థి విభాగం నగర అధ్యక్షుడు శ్రీహరి, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...

కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా బుధవారం కడప నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు అఫ్జల్‌ఖాన్ కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు.

22న చండీ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలతో పాటు ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే లోకకళ్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ తదితర ప్రత్యేక హోమాలు నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

వైభవంగా మారెమ్మతల్లి జాతర

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ చిన్నబిడికి సమీపంలో కొలువైన శ్రీ మారెమ్మతల్లి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. రాత్రి చాందినీబండ్లను ఆలయం చుట్టూతిప్పారు.

ఊరేగింపు సందర్భంగా చెక్కభజనలు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బాణాసంచా పేలుళ్ల మధ్య కన్నులపండుగ వాతావరణంలో జాతర సాగింది. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని ఎస్ఐ రామకృష్ణ గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.



మారెమ్మ మూలవిరాట్



చాందినీబండ్లను ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా వీరయ్య స్వామి తిరునాల

చాపాడు : మండలంలోని బద్రిపల్లెలో బుధవారం శ్రీ అవధూత దిగంబర వీరయ్యస్వామి వారి ఆరాధన మహోత్సవ వేడుకల తిరునాల ఘనంగా నిర్వహించారు. వీరయ్యస్వామి ఆరాధన మందిరంలో ఉదయం 6.30 గంటల నుంచి గురుపూజ, పుష్పాలకరణాది అర్చనలు చేశారు. 7.30 గంటలకు భగవన్నామ సంకీర్తనలు బద్రిపల్లె భజన సంఘంచే ప్రారంభించి లక్ష్మీపేట, కేతవరం, నీలాపురం, సంగటి తిమ్మాయపల్లె, గుడిపాడు, పాటిమీదిపల్లె, గుంతచీపాడు, ఓబుళరెడ్డిపేట, ఖాన్‌ఖాన్‌పల్లెతో పాటు 23 గ్రామాలకు చెందిన భజన బృందాలచే సంకీర్తనలు జరిపారు. మహిళలు నిర్వహించిన కోలాటం , చెక్క భజనలు ఆకట్టుకున్నాయి. రాత్రి 9 గంటలకు భక్త చింతామణి పూర్తి నాటకం వేశారు.

యూనిఫాం నాణ్యత పరిశీలన



యూనిఫాం నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఈఓలు

చెన్నూరు : మండలానికి సంబంధించి 2024–25 సంవత్సరానికి విద్యార్థుల యూనిఫాం నాణ్యతను మండల విద్యాధికారి–1 గంగిరెడ్డి, విద్యాధికారి–2 సునీత బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు మండల కేంద్రానికి చేరాయని, వాటి నాణ్యతను పరిశీలించామన్నారు. ఇంకా షూస్ అందలేదని త్వరలోనే పాఠశాల పునః ప్రారంభమైన తర్వాత విద్యార్థులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఎంఓ (కమ్యూనిటీ మొబైల్ ఆఫీసర్)కేశవరెడ్డి, అసిస్టెంట్ కమ్యూనిటీ మొబైల్ ఆఫీసర్ దశరధరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల అందజేత



పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్న హెచ్‌ఎం బాబురెడ్డి

తొండూరు : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందిస్తున్నట్లు హెచ్‌ఎం సి.బాబురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. అందులో భాగంగా తొండూరు మండలం అగడూరు ప్రభుత్వ హైస్కూల్‌లో ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఇటువంటి సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో ఎరువుల పంపిణీ



రైతు భరోసా కేంద్రంలో ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి మధుసూదన్‌రెడ్డి

తొండూరు : మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో 40 టన్నులు 14–35–14 రకం, 26 టన్నులు 28–28–0 రకం, 15 టన్నులు 20–20–13 రకం, 44 టన్నులు యూరియా ఆర్‌బీకే కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. అలాగే 5.65 టన్నులు డీఏపీ అందుబాటులో ఉందన్నారు. ధరలు ఈ విధంగా ఉన్నాయన్నారు. యూరియా బస్తా ధర రూ.266.50లు, 28–28–0 బస్తా ధర రూ.1700లు, 14–35–14 బస్తా ధర రూ.1700లు, 28–28–0 బస్తా ధర రూ.1250లు, డీఏపీ బస్తా ధర రూ.1331లు ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంధన పొదుపు.. దేశ అభివృద్ధికి మలుపు



మాట్లాడుతున్న ఎంఈఓ గంగిరెడ్డి

చెన్నూరు : ఆధునిక కాలంలో ఏ పని జరగాలన్నా ఇంధన అవసరం తప్పనిసరి అని వాటిని పొదుపుగా వాడుకోవడం అభివృద్ధికి మూలమని చెన్నూరు మండల విద్యాశాఖ అధికారులు డి.గంగిరెడ్డి, సునీతలు పేర్కొన్నారు. బుధవారం వారు మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి ఇంధన పొదుపు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనవసరంగా గృహంలో గానీ, కార్యాలయాలలో గానీ విద్యుత్తును దుర్వినియోగ పరచరాదన్నారు. ఇంటి కిటికీలు తెరవడం ద్వారా సహజంగా గాలి, వెలుతురు అందుతాయని అవి ఆరోగ్యానికి ఎంతో తోడ్పాడతాయన్నారు. అవసరం మేరకే విద్యుత్తును వాడాలన్నారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులైన సోలార్ ఎనర్జీ నీ ఎక్కువగా వాడుకోవాలని వారు విద్యార్థులకు సూచించారు.

విత్తనశుద్ధిని విధిగా పాటించాలి



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి రాజేంద్రప్రసాద్

వేంపల్లె : వేరుశనగ పంట సాగుకు ముందు రైతులు విధిగా విత్తనశుద్ధిని పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి రాజేంద్రప్రసాద్ సూచించారు. బుధవారం స్థానిక వ్యవసాయ కేంద్రం నందు సిబ్బంది, రైతులకు విత్తనశుద్ధి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంటకు విత్తనాల ద్వారా, నేల ద్వారా ఆశించే తెగుళ్ల నుంచి సంరక్షించడానికి, పంట తొలిదశలో ఆశించే రసం పీల్చు పురుగులను నివారించడానికి వివిధ రకాల శిలీంధ్రనాశినులతో, కీటకశినులతో, జీవసంబంధమైన రసాయనాలతో విత్తనశుద్ధి చేయాలన్నారు. అలాగే అధిక ఆదాయం కోసం వేరుశెనగ పంటలో మిశ్రమ పంటగా 7 వరుసలు వేరుశనగ, ఒక వరుస కంది వేసుకుంటే ప్రధాన పంటతో పాటు మిశ్రమ పంటలో కూడా అధిక లాభాలు సాధించవచ్చన్నారు. వేరుశెనగ విత్తనశుద్ధి విత్తుటకు 10 నిమిషాల ముందు విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.